

వందశాతం ఈ-పంట నమోదు

96 శాతం ఈకేవైసీ పూర్తి - కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత రబీ సీజన్‌లో వంద శాతం ఈ పంట నమోదు, 96 శాతం ఈకేవైసీ పూర్తి చేశామని కలెక్టర్ బసంత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 95,538 ఎకరాలలో వరి వేరుశనగ మొక్కజొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. సాగు చేసిన పంటలన్నింటికీ వ్యవసాయ శాఖ గ్రామ వ్యవసాయ సహాయకులు ఇప్పటివరకు వంద శాతం పూర్తిగా ఈ పంట నమోదు చేశారన్నారు. నమోదు అయిన పంట వివరాలను రైతులు సరిచూసుకోవాలన్నారు. ఈకేవైసీ ఇంకా చేయించుకోని వారు మార్చి 4వ తేదీ లోపు నమోదు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు.

కష్టాల్లో ఉన్న జనంపై భారాలా..?

◆ పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి ◆ జిల్లా వ్యాప్తంగా సిపిఎం నిరసనలు

కరోనా కష్టం... నిత్యావసర ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న జనంకు ఆసరాగా ఉండాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచి భారాలు మోపడం తగదని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో గురువారం నాడు నిరసన తెలిపారు.



సోమందేపల్లిలో సిలిండర్లను మోస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

సోమందేపల్లి : పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో సిలెండర్లను భుజంపై మోస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందన్నారు. ప్రతి నెల గ్యాస్ ధరలు పెంచి సామాన్య , పేద ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను పేద, మధ్యతరగతి ప్రజలు పునరాలోచించి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం తప్ప పేద ప్రజలకు ఉపయోగం లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పేద, సామాన్యప్రజలు కేంద్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి రాజగోపాల్, మండల కార్యదర్శి రాజగోపాల్, కమిటీ సభ్యులు కెవిపిఎస్ వెంకటేష్, చాంద్ భాషా, మాబు, మాజీ వార్డ్ మెంబర్ వెంకటేష్ , సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, చంద్రశేఖర్, రామాంజనేయులు, హుస్సేన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, రవి, మండల నాయకులు వెంకటేశులు, మల్లికార్జున యాదవ్, కెవిపిఎస్ మండల నాయకులు రామాంజనేయులు, ఆటో యూనియన్ నాయకులు మోహన్ నాయక్, నాగరాజు, ఆంజనేయులు, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఎం పుట్టపర్తి డివిజన్ నాయకులు గౌస్ మండల కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. గతంలో 400 రూపాయలు ఉన్న గ్యాస్ ధర ఇప్పుడు 1200 రూపాయలకు పెంచారని విమర్శించారు. తక్షణమే వీటిని తగ్గించాలని లేకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు

17 నుంచి జిల్లాలో యువగళం

◆ కదిరి నుంచి పాదయాత్ర మొదలు
◆ 40 రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో లోకేశ్ పాదయాత్ర
◆ విజయవంతం చేయడంపై టిడిపి నేతల సమావేశం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పేరుతో గత నెలలో ప్రారంభించిన పాదయాత్ర ఈ నెల 17వ తేదిన సత్యసాయి జిల్లాలోకి ప్రవేశించనుంది. కదిరి నియోజకవర్గంలోకి ప్రవేశించిన తరువాత 40 రోజుల పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో లోకేశ్ పాదయాత్ర ఉండనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర రూట్ మ్యాప్‌తోపాటు ఏ రకంగా విజయవంతం చేయాలన్న దానిపై జిల్లా టిడిపి నేతలతోపాటు, పార్టీ పరిశీలకులుగానున్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవీంద్రలు గురువారం నాడు కదిరిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సత్యసాయి జిల్లా పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారధి, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, కందికుంట వెంకట ప్రసాద్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాదయాత్ర రూట్ మ్యాప్‌పైనా ప్రాథమికంగా చర్చించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలుంటే మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం మినహా తక్కిన అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్ర కవర్ చేసే విధంగా ప్రణాళిక చేసినట్టు తెలుస్తోంది. నియోజకవర్గానికి కనీసం మూడు రోజులు యాత్ర కొనసాగే విధంగా చూస్తున్నారు. కదిరిలో వారం రోజులుగా జరుగుతున్న వివాదం నేపథ్యంలో ఈ యాత్ర అక్కడి నుంచి ప్రారంభం కానుండటంతో పెద్దఎత్తున పాదయాత్రకు స్పందన లభించే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్న యోచనలో పార్టీ నేతలున్నారు.

తెలుగుదేశం పార్టీకి ఉమ్మడి అనంతపురం జిల్లాకు పెట్టని కోట వంటిది. అయితే 2019 ఎన్నికల్లోనే గతంలో ఎన్నడూలేనంత ఎక్కువగా దెబ్బతింది. 14 నియోజకవర్గాల్లో కేవలం రెండు చోట్ల మాత్రమే గెలుపొందింది. 12 నియోజకవర్గాల్లో ఓటమిని చవి చూసింది. ఆ పార్టీ ఇంతటి ఘోర ఓటమిని జిల్లాలో ఎన్నడూ చూడలేదు. ఈ ఎన్నికల్లో దెబ్బతిన్నాక పార్టీ కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొంది. స్థానిక సంస్థల్లోనూ ఇదే రకంగా దెబ్బతింది. వెనకబడిన తరగతులు పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు. కాని ఇటీవలి కాలంలో వెనుకబడిన తరగతుల ఓటింగ్ చెదిరిపోతున్నట్టు కనిపిస్తోంది. వారు వైసిపి వైపు కూడా మొగ్గు చూపుతుండటంతో టిడిపి దెబ్బతినడానికి కారణమవుతోందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇప్పుడు లోకేశ్ పాదయాత్ర ద్వారా చెదిరిన బిసి ఓటరును సమీకరించే ప్రయత్నం చేస్తారా అన్నది చర్చనీయాంశంగా ఉంది. అదే విధంగా సీనియర్లుగానున్న నేతల మధ్యనున్న విభేదాలు కూడా పార్టీని బలహీనపరుస్తున్నాయి. ఓటమి తరువాత కూడా ఆ పార్టీలో గ్రూపు రాజకీయాలు తగ్గడం లేదు. వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో లోకేశ్ పాదయాత్ర జిల్లాలో 40 రోజుల పాటు నడవనుండటంతో అటు ప్రజల్లోకి వెళ్తూనే, పార్టీని బలపరుచుకోవడంపైనా లోకేశ్ దృష్టి సారిస్తారా అన్న చర్చ టిడిపి క్యాడర్‌లో సాగుతోంది. ఈ యాత్రకు వచ్చే స్పందన ద్వారా ఆ పార్టీకి రాబోయే రోజుల్లో భవిష్యత్తు ఏ రకంగా ఉండనుందన్న అంచనాకూ రావచ్చునని పార్టీ పరిశీలకులు భావిస్తున్నారు.

దళిత విద్యార్థిని ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండలంలోని కోటంపల్లి గ్రామానికి చెందిన సాయికుమారి ఆత్మహత్యకు కారకులైన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలోని నాయకులు గురువారం కోటంపల్లి గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటంపల్లికి చెందిన నలుగురు ఆకతాయిలు సాయికుమారిని కొద్దిరోజులుగా వేధిస్తూ ఉండేవారన్నారు. దీంతో వేధింపులు తాళలేక సాయికుమారి మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. అయితే ఘటన జరిగి మూడు రోజులు గడిచినా పోలీసులు ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. అంతేకాకుండా అధికారులెవరూ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించడానికి రాలేదన్నారు. ఇకపోతే సాయికుమార్ కేసులో నిందితులైన వారు తమ ఇంటి ముందు పదేపదే సంచరిస్తున్నారని, వారి నుంచి తమకు ప్రాణాపాయం ఉందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోందన్నారు. దళితులని ఏమాత్రం కనికరం చూపకుండా అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో తాము వాస్తవాన్ని గుర్తించేందుకు వెళ్లి బాధితుల సమస్యలు అడిగి తెలుకుని వివరించాలని తహశీల్దార్, ఆర్‌డిఒకు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. దీన్నిబట్టి చూస్తే దళితులపై అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సాయికుమారి ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, అధ్యక్షులు హనుమయ్య, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బత్తల కదిరప్ప, బ్రహ్మయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

జిల్లాలో వేగవంతంగా రీ సర్వే పనులు

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వేగవంతంగా రీ సర్వే పనులు చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డికి కలెక్టర్ బసంత్ కుమార్ వివరించారు. గురువారం విజయవాడ నుంచి ముఖ్య కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ పాల్గొన్నారు. ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ, జాతీయ రహదారులకు భూ సేకరణ, గహ నిర్మాణాలు, భూముల రీ సర్వే పనులు వేగవంతం కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే పనులు వేగవంతంగా చేపడుతున్నామని, జాతీయ రహదారులకు భూ సేకరణ ప్రక్రియ నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. 15 రోజుల్లో సేకరించి 350 హెక్టార్ల భూమిని ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రహదారులకు భూములు కోల్పోయిన రైతులకు న్యాయపరమైన పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే పనులు పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. రీ సర్వేలో రెండు రకాల సమస్యలు వస్తున్నాయని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీ సర్వేలో మొబైల్ మెజిస్ట్రేట్‌లను ఏర్పాటు చేసి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రీ సర్వే సకాలంలో పూర్తి చేస్తామని, గహ నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్యాన్ని పూర్తి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచకపాలన : టిడిపి

ప్రజాశక్తి బుక్కపట్నం

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మల్లి రెడ్డి, సత్యసాయి జిల్లా కార్యదర్శి ఆదినారాయణ తదితరులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీలపై అనవసరమైన కేసులు నమోదు చేస్తున్నారన్నారు. కోర్టులను సైతం తప్పుదోవ పట్టిస్తూ వైసిపి ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని ఆరోపించారు. టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కాయగూరల చంద్ర, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, సయ్యద్ బాషా, వెంకటరాముడు, కరణం శ్రీరాములు, కేశవ నాయుడు, ఈశ్వరయ్య, సుధీర్, అబ్దుల్ వాజిద్, జయరాం, మల్లికార్జున పాల్గొన్నారు.

బ్యాంకులు, బంగారు దుకాణాల వద్ద ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని బ్యాంకులు, బంగారు దుకాణాల వద్ద చోరీలు జరగకుండా చెక్ పెట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈమేరకు గురువారం పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకుతోపాటు బంగారు దుకాణాల వద్ద మాస్కులు, టోపీలు పెట్టుకుని అనుమానంగా తిరుగుతున్న వారితో స్పెషల్ డివైజ్ ద్వారా వేలిముద్రలు వేయించి గతంలో ఏ కేసుల్లోనైనా ఉన్నారా.. అని తనిఖీలు చేశారు. అనంతరం బంగారు దుకాణాలు, ఎక్కువగా ఉన్న అంజుమన్ సర్కిల్‌లో విస్తృతంగా పర్యటించి విచారించారు. బ్యాంకులు, ఎటిఎంల వద్ద డబ్బులు డ్రా చేసినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోజూ తమ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచుతారన్నారు. ఎక్కడైనా అనుమానంగా సంచరిస్తున్నట్లు వ్యక్తులు కనపడితే వెంటనే 100, 112కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే అదుపులోకి తీసుకుని విచారిస్తామన్నారు. అనంతరం బ్యాంకులో మేనేజర్‌తో మాట్లాడి ప్రతిచోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.



బ్యాంకు వద్ద వేలిముద్రలు వేసి తనిఖీ చేస్తున్న వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం

నేడు ఖాద్రీశుని కల్యాణోత్సవం

కదిరి టౌన్ : కదిరి పట్టణంలోని శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారంకళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటరోజైన గురుఆరం సకల దేవతలను ఆహ్వానం పలుకుతూ అంకురార్పణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజైన శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభునికి కళ్యాణోత్సవం జరిపిస్తారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గోరంట్ల : మండల కేంద్రంలోనిపాలసముద్రం క్రాస్ వద్ద ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు గౌస్ లాజం మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మికుల శ్రమను గుర్తించి వాహనదారులకు ఫిట్నెస్ కోసం ఎవరి పూచి కత్తు లేకుండా సబ్సిడీ రుణం 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసే ప్రయత్నాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, ఆటో కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు శివారెడ్డి, ఆదిరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు శంకర్, గజేంద్ర రెడ్డి, ఆనంద్, నరేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా టోకరా



◆ అందని మూడోదఫా ఆసరా సాయం
◆ నాలుగేళ్లలో రెండుసార్లతో సరిపుచ్చిన ప్రభుత్వం
◆ రుణమాఫీ కోసం మహిళల ఎదురుచూపు

ఆడబిడ్డలకు ఆసరాగా ఉంటానని, అన్నగా కష్టనష్టాల్లో తోడుగా ఉంటానని ఎన్నికల సమయంలో నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తానని అట్టహాసంగా ప్రకటించారు. అయితే మూడో విడత చెల్లించాల్సి వచ్చేసరికి ప్రభుత్వం వాయిదాలతో దాటవేత ధోరణి ప్రదర్శిస్తుస్తోంది. అక్టోబర్‌లో చెల్లిస్తామన్న రుణమాఫీ గురించి నాలుగు నెలలైనా దాని గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు. ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదు. ఒక్క తాడిపత్రి మండలంలోనే 7613 మందికిపైగా డ్వాక్రా మహిళలు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల కోడ్ పేరుతో నాలుగో విడతకు ప్రభుత్వం ఎగనామం పెట్టేందుకే ప్రభుత్వం ఇలా మూడో విడత పంపిణీని ఆలస్యం చేస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

డ్వాక్రా మహిళలకు చెల్లించాల్సిన రుణమాఫీని చెల్లించకుండా ప్రభుత్వం వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. 2022లో ప్రకటించాల్సిన మూడో విడత రుణమాఫీని 2023 వచ్చినా ఇప్పటివరకు ప్రకటించకుండా లబ్ధిదారులకు టోకరా ఇస్తోంది. 2019 ఏప్రిల్ 11లోపు డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల హామీ ఇచ్చారు. అప్పటికే రుణాలు చెల్లించి ఉంటే వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని ప్రకటించారు.



ఎన్నికల్లో గెలిచిన 15 నెలల వరకూ ప్రభుత్వం ఈ హామీ అమలుకు పూనుకోలేదు. 2019 మే చివర్లో అధికార పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి 2020 సెప్టెంబర్ వరకూ పథకం ఊసే ఎత్తలేదు. దీంతో డ్వాక్రా మహిళల్లో తీవ్ర సంతప్తి నెలకొంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. తప్పని పరిస్థితుల్లో ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పేరుతో రుణమాఫీ పథకాన్ని 2020 సెప్టెంబర్ 11న ప్రారంభించింది. తాడిపత్రి మండలంలో 1115 గ్రూపులు ఉండగా వాటిలో 756 గ్రూపులను అర్హులుగా గుర్తించి వారికి రూ. 250.35 కోట్ల మేర రుణమాఫీ కింద ఇవ్వాలని నిర్ణయించి నాలుగు విడతల్లో ఇచ్చేందుకు నిర్ణయించింది. తొలివిడత మండలంలోని 7613 మందికి ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు రూ. 125.18 కోట్లు పంపిణీ చేశారు. రెండో విడత ఒక నెల ఆలస్యంగా 2021 అక్టోబర్ 7న మరో రూ.6.48 కోట్లు పంపిణీ చేశారు.

మూడో విడత ఎప్పుడు?

2022లో అమలు చేయాల్సిన మూడో విడత రుణమాఫీ గురించి ఇప్పటివరకు ప్రభుత్వం మాట్లాడటం లేదు. నిజానికి కిందటేడాది సెప్టెంబరు, అక్టోబరుల్లోనే మూడో విడత రుణమాఫీ అమలు జరగాలి. కానీ అక్టోబర్ పోయి నాలుగు నెలలు కావస్తున్నా ప్రభుత్వం దాని ఊసే ఎత్తలేదు. 2023 జనవరిలో విడుదల సంక్షేమ క్యాలెండర్‌లో జనవరిలో ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం మార్చి నెల వస్తున్నా ఇప్పటికీ కూడా ప్రకటించలేదు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వంకతో మరో వాయిదా వేసేందుకు సిద్ధమైందని సమాచారం. లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి సచివాలయాల వద్ద ప్రదర్శనకు పెట్టడం మినహా మూడో విడత రుణమాఫీకి సంబంధించి ఇప్పటివరకు జరిగింది ఏమీ లేదు.

నాలుగో విడత ఎగవేత కోసమేనా.?

నాలుగో విడత పథకంపై లబ్ధిదారులు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. మూడో దపా మార్చిలో ఇచ్చినా నాలుగో దఫా పథకం 2024 కి మారిపోతుంది. 2024 ఏప్రిల్‌లో ఎన్నికలు ఉండడంతో ఏడాది ప్రారంభం నుంచే కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కోడ్ పేరుతో నాలుగో విడతకు ప్రభుత్వం ఎగనామం పెట్టేందుకే ఇలా వాయిదాలు వేసుకుంటూ వస్తోందన్న అనుమానం లబ్ధిదారుల్లో వ్యక్తం అవుతున్నాయి.

తాడిపత్రిలో 7613 మంది ఎదురుచూపు

తాడిపత్రి మండలంలో మూడో దఫా ఆసరా కింద 756 గ్రూపులకు చెందిన 7613 మందికి 125.18 కోట్లు రూపాయలు రావాల్సి ఉందని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం మండలంలో 7613 మందికి పైగా రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఒక పూటే నిర్వహించండి

మడకశిర : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 9వ తేదీ నుండి జరగనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను ఒక పూట నిర్వహించాలని విద్యార్థులు కోరుతున్నారు. యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్న 1,3 వ సెమిస్టర్ విద్యార్థుల పరీక్షలు ఈనెల 9 నుంచి ఉదయం 9 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుండి ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారన్నారు. అయితే వేసవికాలం మూలంగా డిగ్రీ పరీక్ష రాసే విద్యార్థులు వివిధ గ్రామాల నుండి వచ్చి పరీక్షల రాసి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు పునరాలోచించి ఒక్కపూట మాత్రమే పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

4వ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీనివాస డిగ్రీకళాశాల విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : ఎస్‌కెయు ప్రకటించిన 4వ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ మసలరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన బీఎస్సీ విభాగంలో స్టాటిస్టిక్స్‌లో ఎం.జాహ్నవి ప్రథమ, సురేష్ ద్వితీయ, అదేవిధంగా ఫిజిక్స్‌లో స్వర్ణలత ప్రథమ, కె.శ్యాంగురు ద్వితీయ, ఎలక్ట్రానిక్స్‌లో తరుణ్ ప్రథమ, వసంత్ ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. బీకాం బీకాంలో బి.హరిప్రియ ప్రథమ, ఎస్.సల్మా ద్వితీయ స్థానాలు, బీజెడ్‌సిలో ఎస్.ఐశ్వర్య ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, బీఏటిహెచ్‌పిలో పి.పల్లవి ప్రథమ, కె.హేమలత ద్వితీయ, బిఎజెహెచ్‌పిలో కె.భువనేశ్వరి ప్రథమ, ఎ.నందిని ద్వితీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు.

ముళ్లపొదల తొలగింపు

బత్తలపల్లి : మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో నాలుగు రోజుల్లో ప్రారంభంకానున్న కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సర్పంచు చెడిపోతుల గోపాల్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు కిరువైపులా ముళ్లపొదలను తొలగించారు. ముళ్లపొదలను తొలగించడంతోపాటు గుంతలకు మట్టి వేయించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

గాలికుంటు వ్యాధితో పశువులకు ప్రమాదం

బత్తలపల్లి : గాలికుంటు వ్యాధి సోకిన పశువుల ఆరోగ్యం పూర్తిగా క్షీణించి చనిపోయే ప్రమాదం ఉందని బత్తలపల్లి పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోటిలో, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయన్నారు. పాడి పశువులకు పొదుగు ఎండిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే పశు వైద్యాధికారిని కలిసి వైద్యం చేయించాలన్నారు. అనంతరం 160 పశువులకు టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

బత్తలపల్లి : త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను తహశీల్దార్ యుగేశ్వరిదేవి గురువారం పరిశీలించారు. ఈమేరకు బత్తలపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించి కిటికీలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఎన్నికల అధికారుల నుంచి ఓటర్లకు పంపిణీ చేయాల్సిన స్లిప్పులు కార్యాలయానికి చేరినట్లు తెలిపారు. వాటిని ఆయా గ్రామాల వారీగా విభజించినట్లు తెలిపారు. త్వరలో బిఎల్ఒలకు అందజేసి ఓటర్లకు అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలో పట్టభద్రులు 1092, టీచర్స్ 52 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకలు

బత్తలపల్లి : మండల పరిధిలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో బాణసంచా కాలుస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బైరెడ్డి అభిమాని బోడిమల్ల మాట్లాడుతూ సిద్ధార్థరెడ్డి అన్న జన్మదినం తమకు పండుగ రోజు అన్నారు. రానున్న రోజుల్లో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎమ్మెల్యేగా కూడా విజయం సాధించాలని పూజలు నిర్వహించారు.

టిడిపి రాష్ట్ర కార్యదర్శి 'గోనుగుంట్ల'కు శుభాకాంక్షలు

ధర్మవరం టౌన్: టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన గోనుగుంట్ల విజయకుమార్‌ను ధర్మవరం మైనార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు గురువారం అనంతపురంలో గోనుగుంట్ల విజయకుమార్‌ను ధర్మవరం నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి క్రిష్ణాపురం జమీర్‌ఆహమ్మద్, 11వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి షాహిన్, 27వ వార్డు ఇన్‌ఛార్జి పఠాన్ బాబూఖాన్, 12వ వార్డు ఇన్‌ఛార్జి స్టార్ షమీర్, 10వ వార్డు అధ్యక్షుడు బుల్లెట్ బాషా, ఐటిడిపి నాయకులు, జిలాన్, షెకావలి, టిఎన్‌ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇర్షాద్, మైనారీ నాయకులు బాబీ, నబీ, తదితరులు పాల్గొన్నారు.

ఇస్తిమా ఏర్పాట్లు పరిశీలన

కదిరి అర్బన్ : కుమ్మరవాండ్లపల్లిలో నిర్వహించనున్న ఇస్తిమాకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి గురువారం పరిశీలించారు. మాజీ మంత్రి షాకీర్, ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్తిమా కార్యక్రమానికి ప్రభుత్వం తరపు నుండి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

హిందూపురం : ఈ నెల 13న జరుగుతున్న శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ, ప్రజాసంఘాల నాయకులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

లేపాక్షి : స్థానిక కస్తూరిబా పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వైద్యాధికారి వెంకట చిరంజీవి మాట్లాడుతూ స్త్రీ విద్య ఆవశ్యకతను వివరించారు. మహిళలు అన్ని రంగాలలోనూ రాణించాలన్నారు. అనంతరం పుట్టపర్తికి చెందిన రవి 90మంది విద్యార్థినులకు రైటింగ్‌పాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నీలిమ, సిబ్బంది సుబ్రహ్మణ్యం, భాగ్యలక్ష్మి, రమాదేవి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షాదీమహల్ నూతన కమిటీ ఎంపిక

కొత్తచెరువు : కొత్తచెరువులోని పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న షాదీ మహల్ నూతన కమిటీని ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి వారి కార్యాలయంలో గురువారం ఎంపిక చేశారు. ఛైర్మన్‌గా గొడ్డల జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా తయుబ్ ఖాన్, సెక్రెటరీగా బాబా ఫక్రుద్దీన్, ట్రెజరర్‌గా మాణిక్యం అరీఫ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నాయకులు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు వాల్మీకి శంకర్, బళ్లారి బాబు, ఎల్లప్ప, మైనార్టీ నాయకులు అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం ముటుకుపల్లి గ్రామానికి చెందిన టైలర్‌బాషా కుమార్తె వివాహం కోసం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ ఆర్థికసాయం అందజశారు. ఈ మేరకు బత్తల యువసేన నాయకుల ద్వారా వివాహానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ముబారక్ మెహబూబ్, జహా, కార్తీక్, సూరినేని కిరణ్, ఈడుగుట్టు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై అనుచిత వ్యాఖ్యలు తగదు

పరిగి : ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులపై, ఉపాధ్యాయురాలుపై అదే కళాశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కుల దూషణతో మాట్లాడినప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోవడం దౌర్భాగ్యం అని ఉపాధ్యాయురాలు సవితారాణితోపాటు పలు ఉపాధ్యాయులు వాపోయారు. పరిగి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సవితారాణి మాట్లాడుతూ ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సుజాత శివారెడ్డి, చెన్నకేశవులు దుర్భాషలాడారన్నారు. ఈ ఘటన జరిగి 15 రోజులు గడిచినప్పటికీ కనీసం వారిపై శాఖాపర చర్యలు కానీ చట్టపరమైన చర్యలు గాని తీసుకోకపోవడం సరికాదన్నారు. రెండు రోజులుగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఇక్కడ పనిచేస్తున్న దళితులను బెదిరించడమే కాకుండా ఫిర్యాదు చేసిన వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఈ భయంతోనే నిజాలు తెలిపేందుకు వెనకడుగు వేస్తున్నారని విమర్శించారు.

ప్రజావాణి వినిపించేవారిని గెలిపిద్దాం





కదిరి, హిందూపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కదిరి టౌన్ : ప్రజావాణిని శాసనసభలో వినిపించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపిద్దామని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు అడ్వకేట్లను అభ్యర్థించారు. ఈ మేరకు వారు గురువారం పట్టణంలోని అడ్వకేట్లను, ప్రయివేటు ఫైనాన్స్ కార్యాలయాల్లో ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును పోతుల నాగరాజుకు వేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి. సుబ్బిరెడ్డి, సిఐటియు నాయకులు జివిఎల్. నరసింహులు, జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్‌అలీ, సుధాకర్, తిరుపాలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలిపించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, రఫీక్, నాగేష్, రమేష్, బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..... ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి బాబావలి ఆధ్వర్యంలో పట్టణంలో ప్రభుత్వ, ప్రవేటు విద్యాలయాల్లో పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ, తదితరులు

చిన్నారుల ఆలోచనలకు ప్రతిరూపం అద్భుత ప్రయోగాలు

ప్రజాశక్తి-హిందూపురం

చిన్నారుల ఆలోచనలకు ప్రతిరూపం వారు చేసినా అద్భుత ప్రయోగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వేణు విద్యా విహార్‌లో పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ప్రవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలను వారు తిలకించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రయోగాల్లో ఉత్తమమైన వాటిని న్యాయమూర్తులచే ఎంపిక చేసి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాసీరాభాను, పాఠశాల కరస్పాండెట్ వేణుగోపాల్, ప్రవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు రీయాజ్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాడు ఆమోదించారు.. నేడు రద్దు చేశారు...

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ పాలక వర్గం ఎందుకు అమోదం తెలుపుతారో.....ఎందుకు రద్దు చేస్తారో వారికే అర్థం కావడం లేదు. పురపాలక సంఘంలో నూతనంగా నిర్మాణం చేసిన ప్రాంతంలో లక్ష్మినరసింహ స్వామి ఆలయం వెనుక స్వచ్ఛభారత్‌లో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణ కోసం స్థలం కేటాయిస్తు రెండు నెలల క్రితం కౌన్సిల్ అమోదం తెలిపింది. దీంతో అధికారులు దానికి సంబందించి రికార్డులు సిద్ధం చేసి నిర్మాణం కోసం గుత్తేదారులకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. దీంతో గత వారం కింద కేటాయించిన స్థలంలో మరుగుదోడ్ల నిర్మాణం చేయడానికి భూమి పూజ చేయాడానికి వెళ్లారు. అయితే ఆ ప్రాంత ప్రజలతో పాటు వివిధ పార్టీలకు చెందిన వారు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో ఈ విషయం తీవ్ర వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ చాంబర్‌లో పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు కలిసి ఈ విషయంపై సమగ్రంగా చర్చించి, గతంలో అమోదం తెలిపిన ప్రాంతంలో మరుగుదోడ్ల నిర్మాణం చేయడాన్ని రద్దు చేస్తు తీర్మానం చేసుకున్నారు. ఈ సమావేశంలో వైస్‌ఛైర్మన్ జబివుల్లా, వైసిపి, టిడిపి, బిజెపి కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పాలక వర్గ సభ్యులు

వైసిపి దుర్మార్గపు విధానాలను తిప్పికొడదాం

మాజీ మంత్రి, టిడిపి జోనల్ ఇన్‌ఛార్జి అమర్నాథ్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి, కదిరి టౌన్

వైసిపి దుర్మార్గపు విధానాలను తిప్పికొడదామని మాజీ మంత్రి, టిడిపి జోనల్ ఇన్‌ఛార్జి అమర్నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈనెల 17న ఉమ్మడి అనంతరపురం జిల్లాలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో యాత్రపై చర్చించేందుకు గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ సమీక్ష సమావేశం పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్‌హాల్‌లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ వైసిపికి చెందిన 60 మంది ఎమ్మెల్యేలు తమ పార్టీకి టచ్‌లో ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 17 వ తేదీన కదిరి నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ పాదయాత్ర దిగ్విజయం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. వైసిపి ప్రభుత్వం పాదయాత్రకు అడుగడుగున అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. చిత్తూరు జిల్లాలో ఇప్పటికే 9 కేసులు నమోదు చేయించారని అన్నారు. లోకేష్ పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని వ్యాఖ్యానించారు.కదిరి పట్టణంలో సిఐ దుర్భాషలాడుతూ టిడిపి శ్రేణులే లక్ష్యంగా పెట్టుకుని వారిని ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. టిడిపి నాయకులపైనా, పాత్రికేయులపైనా అక్రమంగా కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి అరాచక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన నాయకులు బీదరవిచంద్ర, పయ్యావుల కేశవ్, పార్థసారధి, పరిటాల సునీత, నిమ్మలకిష్టప్ప, పరిటాల శ్రీరామ్, సవిత, గుండుమల తిప్పేస్వామి, ఈరన్న, అంబికా కృష్ణమూర్తితో పాటు టిడిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని సిరికల్చర్ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కేతిరెడ్డికాలనీకి చెందిన రమాదేవి, ఆమె కుమారుడు చెన్నకేశవులు ద్విచక్ర వాహనంలో పని నిమిత్తం పట్టణంలోకి వస్తుండగా సిరికల్చర్ కార్యాలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో రమాదేవి, చెన్నకేశవులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ప్రభుత్వ ఖాజీపై దాడికి యత్నం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆబాద్‌పేటలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఖాజీ ముక్తియార్ మౌలనాపై ఖబ్రస్థాన్ మసీదులో మౌలానాగా విధులు నిర్వహిస్తున్న వలీవుల్లా తండ్రి రహంతుల్లా గురువారం దాడికి యత్నించారు. ఈ సంఘటనపై ప్రభుత్వ ఖాజీ ముక్తియార్ మౌలనా స్థానిక స్టేషన్‌తో పాటు జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. గత కొన్ని రోజులుగా ఖబ్రస్థాన్ మసీదులో మౌలానాగా విధులు నిర్వహిస్తున్న వలీవుల్లా వ్యవహారశైలి సరిగా లేదు. మతోన్మాదాన్ని రెచ్చగోట్టే విధంగా ఉండడంతో పాటు వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న ఖబ్రస్థాన్‌లో ఎవరికి ఎటువంటి సమాచారం లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జామీయ మసీదు కమిటీ నిర్వహకులు దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ఖాజీ ముక్తియార్ మౌలనా వెళ్లడంతో వలీవుల్లా తండ్రి రహంతుల్లా ప్రభుత్వ ఖాజీ ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడాడు. దాడికి యత్నిస్తూ, బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితులు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై జామీయ మసీదు కమిటీ నిర్వహకులు సైతం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించారు. అయితే ఇప్పటికే ఖబ్రస్థాన్‌లో విధులు నిర్వహిస్తున్న వలీవుల్లా మతాచారాలకు అడ్డుపడడంతో కొంత మంది మైనార్టీలు ఇప్పటికే అతనిపై వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సైతం కేసు నమోదు అయింది. అయితే ఆ సమయంలో పోలీసులు వలీవుల్లాను అదుపులోకి కనీస విచారణ సైతం చేపట్టకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కర్నాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు : మండల పరిధిలోని లక్ష్మి పురం గ్రామ సమీపంలో గురువారం కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహణంలో మద్యాన్ని తీసుకొస్తుండగా వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 182 కర్నాటక మద్యం పాకెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపనున్నట్లు చెప్పారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కదిరి అర్బన్ : మండల పరిధిలోని గంగన్న గారి పల్లి గ్రామంలో పత్రికుల బంధువులు నిర్మించిన రామాలయ నిర్మాణానికి దాత విరాళం అందజేశాడు. ఉపాధ్యాయుడు రవీంద్రనాయుడు తనవంతు సాయంగా పదివేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీపై విఆర్‌ఒలతో సమావేశం

పుట్టపర్తి రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి పుట్టపర్తి డివిజన్లో ఓటర్ల స్లిప్పులను ఓటర్లకు అందజేసి వారి నుండి సంతకాలు సేకరించాలని ఆర్డీవో భాగ్యరేఖ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం బిఎల్‌ఓలు వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించిన ఓటరు స్లిప్పులను బిఎల్‌ఒలకు అందజేశారు. ఈనెల ఆఖరులోపు ఓటరు కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం పక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నవీన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ తరుణ్ తేజ, ఆపరేటర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి ఉత్సవాలు

హిందూపురం : ఈ నెల 7. 8వ తేదీల్లో జరిగే శ్రీ క్షేత్రం కైవారం తాత గారి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని శ్రీ సద్గురు యోగి నారాయణ సేవా సమితి నాయకులు కోరారు. ఈ మేరకు ఆరు గురువారం పట్టణంలోని కెవిఆర్ ఫంక్షన్ హాలులో ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ రవిశంకర్, ఆశ్వర్థనారాయణ స్వామి, రాజప్ప స్వామి, బసవరాజు, శివన్న స్వామి, జగన్నాథరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి మడకశిర

త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని మడకశిర నియోజకవర్గం ఎన్నికల విభాగం ప్రత్యేక అధికారి మారుతి ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల తరపున ప్రచారం చేసే రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. బూత్ స్థాయి అధికారులతో సైతం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారికి ఓటరు స్లిప్పులు అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్‌కమిషనర్ ప్రభాకర్ రావు, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు జై కుమార్, ఆయా రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, బాధిత కార్మికులు

కార్మికులకు పిఎఫ్ సెటిల్మెంట్ డబ్బులు చెల్లించాలి

చిలమత్తూరు : గతంలో రిచ్ మ్యాన్ సిల్క్ పరిశ్రమలో పని చేసి లాక్‌అవుట్ నేపథ్యంలో తమ జీవనోపాధి పోగొట్టుకున్న కార్మికులకు పూర్తిస్థాయిలో పిఎఫ్, సెటిల్మెంట్ డబ్బులు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కొడికొండ చెక్‌పోస్టు వద్ద గల రిచ్ మ్యాన్ సిల్క్ పరిశ్రమ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాలు పని చేసిన కార్మికులను మోసం చేసిన యాజమాన్యం గత కొద్ది సంవత్సరాల క్రితం లాక్ అవుట్ చేసిందన్నారు. అయితే కార్మికులకు న్యాయంగా రావాల్సిన పిఎఫ్, సెటిల్మెంట్ డబ్బులు పూర్తిగా ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. అయితే ఆ పరిశ్రమను వెరొకరి ఇచ్చి ఈ మధ్య కాలంలో పున్ణ ప్రారంభాంచారని అన్నారు. అయితే దానిని వ్యతిరేకించడం లేదని గతంలో పని చేసిన కార్మికులకు న్యాయం చేయకుండా నడపడం దుర్మార్గమని అన్నారు. కార్మికులకు న్యాయం చేయకపోతే పరిశ్రమలో పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామచంద్ర, కార్మికులు శ్రీనివాసులు, శ్రీరాములు, నంజుండప్ప, రామాంజినేయులు, ఆశ్వర్థనారాయణ, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, సెల్వరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట అవశేషాలను పొలాల్లో కాలిస్తే నష్టం

ప్రజాశక్తి-హిందూపురం

పంటపొలాల్లో పంట అవశేషాలను కాల్చరాదని, కాల్చితే భూమి, వాతావరణ కాలుష్యం ఏర్పడడంతో పాటు నేలలో ఉన్న సూక్ష్మజీవులు చనిపోతాయని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఈ మరకు ఆయన మాట్లాడుతు చాలామంది రైతులు వారు పండించిన పంటపొలాల్లో పంట కోసి మిగిలిన పంట బాగాలను అక్కడే కాల్చుతున్నారన్నారు. ఇలా చేయడం వల్ల తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. వాతవరణ కాలుష్యంతో పాటు జంతువులకు, పక్షులకు హాని జరుగుతుందన్నారు..

పాత్రికేయులపై కేసులు తగదు

తనకల్లు : కదిరి పట్టణంలో టిడిపి ,వైసిపి శ్రేణుల మధ్య జరిగిన ఘర్షణలను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టడం తగదని తెలుగు యువత మండల అధ్యక్షులు కావడి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న పాత్రికేయులపై ఈ మధ్యకాలంలో వరుస భౌతిక దాడులు జరుగుతుండడం బాధాకరమన్నారు. మీడియా గొంతు నొక్కే ప్రయత్నం చేయడం మంచిది కాదన్నారు. విలేకర్లపై కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రిపోర్టర్లపై దాడికి పాల్పడిన పోలీసుల పైన అందుకు కారణమైన సిఐపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పుట్టపర్తి రూరల్: పాత్రికేయులపై కేసులు బనాయించడం సబబు కాదని పుట్టపర్తి జర్నలిస్టులు అన్నారు. ఈ మేరకు వారు శ్రీ సత్య సాయి జిల్లా అడిషనల్ ఎస్పీకి గురువారం ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా జర్నలిస్టు యూనియన్ నాయకులు అయ్యంగారి శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి సిఐ మధు ఇంటి ముందు ధర్నా నిర్వహించిన సమయంలో న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన ఆరుగురు పాత్రికేయుల కేసులు బనాయించారని వాటిని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జర్నలిస్టు యూనియన్ నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.